సాక్షి అనకాపల్లి

గురువారం । 14 । నవంబర్ । 2024



హుండీ లెక్కింపు

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి ఆలయంలో హుండీ లెక్కించగా నెల రోజుల కాలానికి రూ.39.29 లక్షలు వచ్చింది.



పట్టు సాధించాలి

విశాఖ విద్య: టిబెట్ బౌద్ధ భిక్షువు పూంట శ్చక్ ఏయూ తత్వశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. ఫిలాసఫీపై పట్టు సాధించాలన్నారు.



బయో డైవర్సిటీ పార్క్ సందర్శన

జీచ్‌రోడ్డు: విశాఖ ఏవీఎన్ కాలేజ్ బోటనీ విభాగం విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు.

బుడుగులం... పిడుగులం

పిల్లలం మేం బడిపిల్లలం మేం..బుడుగులం మేం పిడుగులం.. నింగికి నేలకు నిచ్చెనలేసే విశ్వప్రేమకు వారసులం... మట్టితో కుండలు చేస్తాం..ఇసుకతో కోటలు కడతాం... అంటూ చిన్నారులు ప్రతిభలో తమకు తామే సాటిగా నిరూపించుకుంటున్నారు... నేడు బాలల దినోత్సవం సందర్భంగా వారి కలలు, కథలు..

భలే 'యోగ'ం



అంతర్జాతీయ యోగాలో సత్తా చాటిన లయవర్ధన్



వెన్నెల శ్రీ వేసిన యోగాసనం

చోడవరం : విల్లు వంచినట్టుగా దేహాన్ని వంచి యోగాసనాల్లో మేటి అనిపించుకుంటున్నారు ఈ చిన్నారులు. చిన్నతనంలోనే యోగ సాధనలో కీర్తిని సొంతం చేసుకున్నారు. చోడవరానికి చెందిన పతంజలి యోగా కేంద్రం విద్యార్థులు పందిరి వెన్నెల శ్రీ (13), గొంతిన లయవర్ధన్ (14) యోగాలో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిభ చూపే యోగా క్రీడాకారులను మాత్రమే అవకాశం దక్కే ఇంటర్నేషనల్ యోగాసన చిల్డ్రన్స్ క్యాలండర్‌కు గతేడాది ఎంపికై ప్రపంచ వ్యాప్తంగా చోడవరం కీర్తి ప్రతిష్టలను చాటారు. అనకాపల్లి జిల్లా చోడవరం కేంద్రంగా గత 15 యేళ్లుగా యోగా గురువు పుల్లేటి సతీష్ ఆధ్వర్యంలో పతంజలి యోగా కేంద్రం నిర్వహిస్తున్నారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ కేంద్రంలో అనేక మంది విద్యార్థులు ఇక్కడ యోగాపై శిక్షణ పొందుతున్నారు. వీరిలో వెన్నెలశ్రీ, లయవర్ధన్ ఎంతో ప్రతిభా వంతులైన క్రీడాకారులుగా అనేక బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగాలో ప్రతిభ కనబరిచారు. 2023 ఇంటర్నేషనల్ యోగాసన చిల్డ్రన్స్ క్యాలండర్‌కి భారతదేశం నుంచి లయవర్ధన్, వెన్నెల శ్రీ ఎంపికై మరింత ప్రతిష్టను పెంచారు. భారత్, యూఎస్‌ఏ, బ్రిటన్, ఇటలీ, నేపాల్, జర్మనీ, శ్రీలంక, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, దుబాయ్, ఇరాన్‌తో పాటు 20దేశాలకు చెందిన విద్యార్థుల యోగాసనాలు ఈ క్యాలండర్‌లో ప్రచురించగా మన దేశం నుంచి వీరిద్దరూ స్థానం దక్కించుకొని రాష్ట్రంతో పాటు మన జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. వీరిద్దరూ 9వ తరగతి చదువుతున్నారు. వెన్నెల శ్రీ ఇప్పటికే ఒక అంతర్జాతీయ, నాలుగు జాతీయ స్థాయి బంగారు పతకాలు సాధించగా, లయవర్ధన్ ఒక అంతర్జాతీయ, ఐదు జాతీయ స్థాయి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ఇటీవల ఒడిశాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకంతోపాటు ఆల్‌రౌండర్‌గా నిలవడం మరో విశేషం.

భళా.. రోహిత్ 'ఆర్ట్'





పెయింటింగ్ వేస్తున్న పుట్టా రోహిత్

మాడుగుల రూరల్ : బాల్యంలోనే రోహిత్ చిత్రలేఖనంలో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. మాడుగుల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల(గెడ్డబడి)లో 5వ తరగతి చదువుతున్న పుట్టా రోహిత్ చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో మక్కువ. మాడుగుల జాగాని వీధికి చెందిన పుట్టా పెద హనుమంతు, సుహాసిని దంపతుల పెద్ద కుమారుడు రోహిత్ పెన్సిల్, స్కెచ్ పెన్సిల్‌తో, పెన్నుతో అందమైన చిత్రాలకు రంగులద్దుతున్నాడు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సూర్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చేయి తిరిగిన కళాకారుడిగా ఎదుగుతున్నాడు. దేవతామూర్తులు, దేశ నాయకులు, బొమ్మలు, బ్రూస్లీ, కరెన్సీ నోట్లు ఇలా కాదేదీ పెయింటింగ్‌కు అనర్హం అన్నట్టుగా కాన్వాసుపై రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించాడు. అందరి ప్రశంసలు అందుకున్నాడు.

పంచ్ విసిరితే పతకాలే...



కూడ అఖిల్

కశింకోట : సంకల్పం ఉంటే సాధించలేనిది ఉండదు. ఒకటి కాదు.. రెండు ఆటల్లో ఒకే స్థాయిలో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి మరింత ముందుకు దూసుకుపోవడానికి కూడ అఖిల్ ప్రయత్నిస్తున్నాడు. అందరి ప్రశంసలు పొందుతున్నారు. కశింకోటలోని డీపీఎస్ జెడ్పీ హైస్కూలుకు చెందిన అఖిల్ ఇక్కడి బీసీ వసతి గృహంలో ఉంటూ టెన్త్ చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఈ ఏడాది జిల్లా స్థాయిలో అనకాపల్లిలో నిర్వహించిన జూడో పోటీలో బంగారు పతకాన్ని సాధించి శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో వెండి పతకాన్ని పొందాడు. ఈ ఏడాది కుస్తీ పోటీల్లో కూడా సత్తా చూపాడు. జిల్లా స్థాయిలో పాడేరులో నిర్వహించిన పోటీలో ప్రథమంగా నిలిచి బంగారు పతకం సాధించాడు. తద్వారా విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వచ్చే ఏడాది జాతీయ స్థాయి పోటీలో పాల్గొని బంగారు పతకాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నట్టు అఖిల్ 'సాక్షి'కి తెలిపాడు. ఆటల్లో రాణిస్తూ వైద్యుడు కావాలన్నదే తన లక్ష్యమన్నారు. కుస్తీలో తన మావయ్య నూకరాజు, స్థానిక పీడీ వి.ప్రభాకరరావు వద్ద తర్ఫీదు పొందినట్టు తెలిపాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అఖిల్‌ది కొయ్యూరు మండలం అంకంపాలెం గ్రామం కాగా, తల్లిదండ్రులు రాజుబాబు, జ్యోతి ఎంతో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపాడు.

కత్తి సాములో సై...



కోడూరు గుణశేఖర్

కశింకోట : కశింకోటకు చెందిన కోడూరు గుణశేఖర్ కత్తి సాములో రాణిస్తున్నాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో బంగారు, కాంస్య పతకాలు పొంది అందరి ప్రశంసలందుకున్నారు. కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో టెన్త్ చదువుతున్న గుణశేఖర్ మూడేళ్ల క్రితం కత్తి సాముపై ఆసక్తి పెంచుకున్నాడు. అతని ప్రతిభను గుర్తించిన పీడీ వేదుల ప్రభాకరరావు తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో గత ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో, ఈ ఏడాది గొవాడలో జరిగిన కత్తిసాము (ఫెన్సింగ్) పోటీల్లో గుణశేఖర్ జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించాడు. తరువాత నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. ఇక వచ్చే ఏడాది జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకంపై గురిపెట్టాడు.

ట్రిపుల్ ఐటీ వంటి ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగం పొందాలనేది తన లక్ష్యమని గుణశేఖర్ 'సాక్షి'కి తెలిపాడు. సినిమాల్లో కత్తి సాములు చూసి దానిపై ఆసక్తి కలిగి నేర్చుకున్నట్టు తెలిపాడు.



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో చిల్డ్రన్స్‌డే వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరు కానున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా జరగనుంది. ఈనెల 14న గురువారం చిల్డ్రన్స్ డే సందర్భంగా అనకాపల్లి టౌన్‌లోని విజయరామారావుపేటలో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయ వసతి గృహంలో వేడుకలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్పీ తుహిన్ సిన్హా పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ఆయన కేక్ కట్ చేస్తారు. బాలల కోసం నిర్వహించే ఆటల పోటీలను ప్రారంభిస్తారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

న్యూస్‌రీల్

మోదమ్మ సన్నిధిలో సినీ నటి మీనాక్షి



సినీ నటి మీనాక్షికి అమ్మవారి జ్ఞాపిక అందజేత

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మను ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి బుధవారం దర్శించుకున్నారు. ఆమె వారం రోజులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో అరకులోయలో జరుగుతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమా షూటింగ్‌లో విక్టరీ వెంకటేష్‌తో కలిసి పాల్గొన్నారు. తిరుగు ప్రయాణంలో మాడుగుల మోదకొండమ్మను దర్శించుకున్నారు. అందమైన కొండల నడుమ అలరారుతున్న ఆలయ పరిసరాలను చూసి ఇక్కడి ప్రకృతి దృశ్యాలు అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆమెను దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.


సాగునీటి సంఘాల ఎన్నికలకు బ్రేక్?

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు మరోసారి బ్రేక్ పడినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమావేశాలు సాకుగా చూపుతూ ఎన్నికలు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. అయితే అధికారులెవరూ ఎన్నికల వాయిదాను ధ్రువీకరించడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి వినియోగదారుల ఓటర్ల జాబితాను బుధవారం ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. జరగలేదు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు

నాతవరం: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి నాతవరంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ఎన్నికల నిర్వహణ డీఈ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె



డీఎంహెచ్‌వో బాలాజీకి సమ్మె నోటీస్

అనకాపల్లి: 108 ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్టు 108 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రతినిధులు పి.కోటేశ్వరరావు, బీవీఎస్ మూర్తి తెలిపారు. ఇన్‌చార్జ్ డీఎం అండ్ హెచ్‌వో బాలాజీకి బుధవారం యూనియన్ ప్రతినిధులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్పు చేసే ప్రతిసారి ఉద్యోగులు గ్రాట్యూటీ, ఎర్న్ లీవుల నగదు, వార్షిక ఇంక్రిమెంట్‌లు నష్టపోతున్నారని చెప్పారు. 108 సర్వీసులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు

చోడవరం రూరల్: గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు తాడి రాజుకు అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. 2013లో ఆటోలో 90 కేజీల గంజాయి తరలిస్తుండగా కట్టవానిఅగ్రహారం గ్రామం దరి బొడ్డేరు వంతెన వద్ద చీడికాడ పోలీసులు నిందితుడిని పట్టుకొని కేసు పెట్టారు.

ముదురుతున్న 'పంచాయితీ'

- జెడ్పీ సీఈవో ఎంక్వయిరీకి సహకరించని అనకాపల్లి డీపీవో
- ఈవోపీఆర్డీల బదిలీల వివాదంపై మరో విచారణ
- విచారణాధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి

సాక్షి, అనకాపల్లి: పంచాయతీరాజ్ విభాగంలో వివాదాస్పదంగా మారిన ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు బదిలీల వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. నిబంధనలకు విరుద్ధంగా బదిలీల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ అనకాపల్లి డీపీవో శిరీషరాణిపై ఈవోపీఆర్డీలు విశాఖ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నచ్చిన వారిని అందలం ఎక్కించారన్న విమర్శలు వినిపించాయి. ఈ అక్రమ బదిలీల కారణంగా దీర్ఘకాలంగా గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు ఇప్పటికీ మైదాన ప్రాంతాలకు రాలేకపోయారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న వారు గిరిజన ప్రాంతాలకు వెళ్లకుండా తమ పలుకుబడిని ఉపయోగించి స్థానికంగానే పోస్టింగ్‌లు సంపాదించుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖ కలెక్టర్ ఈ బదిలీల వ్యవహారంపై జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తితో విచారణకు ఆదేశించారు. దీని ప్రకారం సీఈవో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పోస్టింగ్‌ల వివరాలు కోరినప్పటికీ.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం, విచారణకు హాజరుకావాలని రెండుసార్లు అనకాపల్లి డీపీవో, అల్లూరి జిల్లా డీపీవోలకు చెప్పినా దుమ్మా కొట్టడంతో విచారణ నుంచి అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయించారు. దీంతో బాధిత ఈవోపీఆర్డీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించినట్టు సమాచారం రావడంతో మరో విచారణకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో విచారణ జరిపిస్తోంది. ఈవోపీఆర్డీలకు, పంచాయతీ కార్యదర్శులకు విచారణకు హాజరుకావాలని సోమ, మంగళవారం నోటీసులు పంపించారు. బుధవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో విచారణ జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు హాజరయ్యారు. మరో నాలుగు రోజులు విచారణ జరగనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదే..!

అవకతవకలు జరిగాయంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయంగా జరగలేదంటూ పంచాయతీరాజ్ ఉద్యోగులు విస్తుపోతున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో జరిగిన ఈవోపీఆర్డీ బదిలీల్లో అక్రమాలు జరిగితే.. గ్రామ సచివాలయాల కార్యదర్శులకు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇవ్వడమేంటని పంచాయతీ అధికారులు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అసలు దొంగలకు కొమ్ముకాయడానికి కూటమి నేతల నుంచి ఉన్నతాధికారుల వరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ జరిపినట్టు కాలయాపన చేసి... చివరకు మమా అనిపించేశారు. బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తుంటే విచారణను పక్కదారి పట్టించడం ఇపుడు పంచాయతీరాజ్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

తొలిరోజు 10 మంది హాజరు

అనకాపల్లి జిల్లాలో పంచాయతీరాజ్ విభాగంలో జరిగిన బదిలీల్లో అవకతవలపై విచారణ చేస్తున్నాం. తొలిరోజు 10 మంది పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు విచారణ ఉంటుంది. విచారణకు రావాలని పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశాం. వాస్తవాలను స్వచ్ఛందంగా మా దృష్టికి తీసుకురావాలి.

– సుబ్బలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విచారణ అధికారి

200 మొబైల్ ఫోన్ల రికవరీ

- బాధితులకు అందజేసిన ఎస్పీ



మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన 200 మొబైల్స్ ఫోన్లను (విలువ సుమారు రూ.30 లక్షలు) ఎస్పీ తుహిన్ సిన్హా ఫిర్యాదుదారులకు అప్పగించారు. తన కార్యాలయంలో బుధవారం మొబైల్ ఫోన్లను అందజేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, కడప జిల్లాలు, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. ఇంతవరకు మొత్తం 3,500 ఫోన్లు పోయినట్టు ఫిర్యాదులు నమోదు కాగా 2208 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. మొబైల్ ఫోన్ పోయినట్లయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్‌లో గానీ 9346912007 వాట్సాప్ నంబర్‌కు గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా సోషల్ మీడియా సీఐ కల్యాణి, ఐటీ కోర్ ఎస్ఐ సురేష్‌బాబు, సీసీఎస్ పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేత్రపర్వం.. వెంకన్న తెప్పోత్సవం



బంధుర సరస్సులో తెప్పోత్సవం, (ఇన్‌సెట్) రాజాధిరాజ వాహనంలో స్వామివారి ఉత్సవ మూర్తులు

నక్కపల్లి: ఉత్తరాంధ్రుల కొంగుబంగారం ఉపమాక వెంకన్న సన్నిధిలో క్షీరాబ్ది ద్వాదశి (చిలుక ద్వాదశి) పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వెలసిన శ్రీ కల్కి వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ సందర్భంగా తిరువీధి సేవ, బంధుర సరస్సులో తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం నాలుగున్నర గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంపైన, శ్రీ సీతారాముల వారి ఉత్సవమూర్తులను, శ్రీ శయన పెరుమాళ్ వారిని ఆంజనేయ వాహనంపైన అధిష్టింపచేసి స్వామివారి పుష్కరిణి వద్ద గల లంక వారి మండపం వద్దకు తీసుకుని వెళ్లారు. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం శయన పెరుమాళ్ వారిని పడవలో అధిష్టింపచేసి స్వామివారిని పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక ఆరాధనలు, చిమ్మిడి నివేదనలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.



స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

స్వామివారి ఉత్సవ మూర్తులకు, సీతారాముల వారికి, శయన పెరుమాళ్ వారికి విశేష ప్రసాద నివేదనలు, తీర్థ గోష్ఠి నిర్వహించిన తర్వాత భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంలోనూ, శ్రీ సీతారాములు, శయన పెరుమాళ్ వారిని ఆంజనేయ వాహనంలోనూ అధిష్ఠింపచేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, భక్తులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు

తుమ్మపాల: జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాల మెరుగు, నిబంధనల క్రమబద్ధీకరణ, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం–2024–29, ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ–2024–29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 2024–29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు భద్రతా చర్యలు కూడా చేపట్టాలన్నారు. జిల్లాలోని పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ యూనిట్లలోని ఉత్పత్తులను డిజిటల్ కామర్స్ విధానంలో అమ్మకాలు చేపట్టేందుకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌లో నమోదు చేయాలన్నారు. అనకాపల్లి, నక్కపల్లి, పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన పథకం కింద యూనిట్ల స్థాపనకు గ్రామీణ పట్టణ ప్రాంతాల యువతను ప్రోత్సహించాలన్నారు.

ఉరి వేసుకొని కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

- రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్ట్‌లో ఘటన

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం నేవల్ బేస్ ప్రాజెక్ట్‌లో కేఈసీ నిర్మాణ సంస్థలో పని చేస్తున్న వలస కాంట్రాక్ట్ కార్మికుడు ఓ చెట్టుకు ఉరి పోసుకొని మృతి చెందాడు. రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర బుధవారం తెలిపిన వివరాలివి.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజ్‌కుమార్ మండల్(26) నేవల్ బేస్ ప్రాజెక్ట్‌లో నిర్మాణ సంస్థ అయిన కేఈసీ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కంపెనీ లోపల ఉన్న వసతిగృహం సమీపంలో కొండపై ఒక చెట్టుకు రాజ్‌కుమార్ ఉరిపోసుకుని మృతి చెందాడు. దుర్వాసన రావడంతో బుధవారం కంపెనీ మేనేజర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కార్తీక దీపోత్సవం

చోడవరం శ్రీస్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద 51 వేల దీపాలతో ఆరాధన



దీపాలంకరణలో శ్రీస్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్) వివిధ ఆకృతుల్లో ఆధ్యాత్మిక వెలుగులు

శివనామస్మరణతో చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం హోరెత్తిపోయింది. కార్తీక దీపాలు ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్మాయి. వంద కాదు వెయ్యి కాదు ఏకంగా 51 వేల దీపాలతో బుధవారం సాయంత్రం శివాలయ ప్రాంగణం కాంతులీనింది. శివ, అయ్యప్పస్వామి మాలధారణ భక్తులతోపాటు సాధారణ భక్తులు ఈ దీపోత్సవ కార్యక్రమంలో వందలాదిగా పాల్గొన్నారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులంతా ముక్తకంఠంతో మహాశివుని ధ్యానించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి రావు, వేదపండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య మహాలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ దీపోత్సవం ఎంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. లింగాకారం, త్రిశూలం, ఓంకారం, స్వస్తిక్, శ్రీ చక్రం ఆకారాలతో దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

– చోడవరం

నేడు మరిడిమాంబ పండగ



మరిడిమాంబ ఆలయం

తుమ్మపాల: మండలంలోని రేబాక గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారు నుంచి అమ్మవారి దర్శనానికి తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఆసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నారు.

రేపు విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయం పరిధిలో 11కేవీ కొత్తూరు టౌన్ ఫీడర్, 11 కేవీ కశింకోట ఎంహెచ్‌క్యూ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం ఈనెల 15వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్ కు బుధవారం 2,136 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,770	4,210
మొదటి రకం	3,500	4,150
రెండో రకం	3,350	3,720
మూడోరకం	3,000	3,340

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో	: పర్తిసాయి
మ్యాట్‌క	: షిర్డిసాయి
కంగువ	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

ఆధ్యాత్మిక తోవ.. అందాల లోవ

- ప్రకృతి రమణీయత మధ్య సాంబశివుని లోవ
- ఏటా కార్తీక మాసంలో భారీగా తరలివస్తున్న సందర్శకులు



కొండపైకి ఏర్పాటు చేసిన రహదారి



తుది దశకు చేరుకున్న సాంబ శివుని ఆలయ నిర్మాణం



ఊడలు పట్టుకుని ఊగుతున్న విద్యార్థులు



సాంబ శివుని లోవలో ప్రకృతి రమణీయత

కశింకోట: కార్తీక మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ సందర్భంగా శివుని విశేషంగా ఆరాధించేందుకు, వన భోజనాల కోసం భక్తులు మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో సాంబ శివుని లోవకు అధిక సంఖ్యలో వస్తారు. దీంతో కార్తీక మాసంలో ఈ ప్రాంతం సందడిగా ఉంటుంది. చుట్టూ కొండలు, పచ్చని చెట్లు, ప్రకృతి రమణీయతతో ఈ లోవ భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్థానికులతోపాటు రెండు నియోజకవర్గాల ప్రజలు, విద్యార్థులు ఏటా ఎక్కువగా ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. అనకాపల్లి-యలమంచిలి మార్గంలో అమీన్‌సాహెబ్‌పేట కూడలి నుంచి లోపలికి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో సాంబశివుని లోవ ఉంది. లోవలో గల పెద్ద మర్రి చెట్టు పొడవైన ఊడలతో పిల్లలను ఆకర్షిస్తోంది. ఇక్కడికి వచ్చే పిల్లల మొదలు పెద్దల వరకు ఆసక్తి ఉన్న వారు ఊడలను పట్టుకొని ఊయలలా ఊగుతుంటారు. కొండపైన వెలసి ఉన్న సాంబ శివుని ఆలయానికి ఒక వైపు మెట్ల మార్గం, మరో వైపు రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. కొండపై నుంచి చూస్తే కనుచూపు మేర ఉన్న ప్రకృతి సౌందర్యం కనువిందు చేస్తుంది. పక్కనే విశాలంగా ఉన్న హైస్కూల్ మైదానం పిల్లలు ఆడుకుంటూ ఆనందంగా గడపడానికి అనువుగా ఉంటుంది. దీంతో కార్తీక మాసంలో పిక్నిక్ కోసం అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాలకు చెందిన గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా ఇక్కడికి వస్తుంటారు. పాఠశాలల విద్యార్థులు, స్నేహితులు, స్థానికులు భారీ సంఖ్యలో వచ్చి వన భోజనాలు చేసి ఆనందంగా గడిపి వెళుతుంటారు. ఆలయం వద్ద ఏటా మహాశివరాత్రి రోజున విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

సాంబ శివుని లోవ ప్రాంతాన్ని రూ.60 లక్షలతో అభివృద్ధి చేయడానికి ప్రైవేటు సిమెంట్ పరిశ్రమ ముందుకు రావడంతో గత ఏడాది పనులు చేపట్టారు. జీర్ణావస్థకు చేరిన సాంబశివుని ఆలయ స్థానంలో నూతనంగా ఆలయం నిర్మిస్తున్నారు. తుది మెరుగులు దిద్దాల్సి ఉంది.అప్పటి వరకు శివలింగాన్ని ఒక షెడ్‌లో తాత్కాలికంగా ఉంచి పూజాధికాలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి రాకపోకలకు సాగించేందుకు వీలుగా మూడు వైపులా రహదారులను ఏర్పాటు చేశారు. వీటిని సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. వాటి పనులు పూర్తి అయితే సర్వాంగ సుందరంగా తయారై సందర్శకులను మరింతగా ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు.

ప్రశాంత వాతావరణం



ఏటా కార్తీక మాసంలో కుటుంబ సభ్యులతోపాటు సాంబ శివుని లోవకు వచ్చి సాంబ శివుని దర్శించి ఆధ్యాత్మిక చింతనతో గడుపుతాం. వన భోజనాలు చేసి ప్రశాంత వాతావరణంలో రోజంతా గడిపి ఆనందాన్ని నింపుకొని ఇళ్లకు చేరుతాం.

– కర్రి రిషి, సోమవరం గ్రామం, కశింకోట మండలం

లోవ అందాలు అద్భుతం



సాంబశివుని లోవ ఆధ్యాత్మికంగానే కాకుండా ప్రకృతి రమణీయత ఆహ్లాదం కలిగిస్తోంది. చుట్టూ పచ్చని చెట్లు, పొలాలు పరుచుకుని కనువిందు చేస్తాయి. ఒకవైపు ఆధ్యాత్మికత, మరోవైపు ఆహ్లాదాన్ని పంచుతూ లోవ అందాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. ఏటా కార్తీక మాసంలో గడిపి వెళుతుంటాం.

– తంటపురెడ్డి శ్రీను, ఎ.ఎస్. పేట, కశింకోట మండలం

జోరుగా అభివృద్ధి పనులు



సాంబశివుని లోవలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.60 లక్షలతో అభివృద్ధి చేయడానికి ఓ ప్రైవేట్ సిమెంట్ పరిశ్రమ ముందుకు వచ్చింది. ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నాం. పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. కొండపై ఉన్న స్వామిని దర్శించుకోడానికి అనువుగా మెట్ల మార్గంతోపాటు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశాం.

– మలసాల రమణారావు, విశాఖ డెయిరీ డైరెక్టర్

సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్ట్ అన్యాయం

అనకాపల్లి: రాష్ట్రంలో నిరంకుశపాలన సాగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సోషల్ యాక్టివిస్టుల పై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి అరెస్టులు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పౌరుల హక్కులను కాలరాయడానికే కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు అధికారం ఇచ్చారా అన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులు ఆపాలని ఆయన కోరారు. పాలన, హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టుల ద్వారా ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట రైల్వే వంతెన సమీపంలో సుమారు 55-60 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని కనుగొన్నట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ లక్ష్మి బుధవారం చెప్పారు. విజయవాడ నుంచి విశాఖ వెళ్లే రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహంపై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నేవీబ్లూ కలర్ ఫుల్‌ఫ్యాంట్ ఉన్నట్టు చెప్పారు. పోస్టమార్టానికి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

వృద్ధుడి అదృశ్యం

అనకాపల్లి: స్థానిక దుర్గాలాడ్జి వీధికి చెందిన అద్దంకి శ్రీనివాసరావు(72) అనే వృద్ధుడు అదృశ్యమైనట్టు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలు... శ్రీనివాసరావు రోజూ మాదిరిగానే బుధవారం తెల్లవారుజామున స్థానిక గాంధీనగరంలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి వస్తానని ఇంటిలో చెప్పి బయలుదేరాడు. అయితే రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో శ్రీనివాసరావు కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి

అనకాపల్లి: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను సకాలంలో వినియోగించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని పంచాయతీరాజ్ జిల్లా కో ఆర్డినేటర్ ఈ.నాగలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం 2025-26 సంవత్సరానికి జీపీడీపీ, బీపీడీపీపై వివిధశాఖల మండలస్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడు పట్టణాలకు వలసలు తగ్గుతాయన్నారు. 13 రకాల యాప్‌లలో గ్రామాల్లో సమస్యలను అప్‌లోడ్ చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చిన నిధులను అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. సకాలంలో నిధులు ఖర్చు చేయకపోతే వెనక్కి వెళ్లిపోతాయన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా గ్రామాల్లో పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మండలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే రహదారులను అభివృద్ధి చేశామని, విద్య, వైద్యానికి పెద్దపీటవేస్తూ, గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గురువారం ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం ఉద్యోగులకు ఒక రోజుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'సంకల్పం'తో మత్తు పదార్థాల నిర్మూలన



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా 'సంకల్పం'కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో బుధవారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టుసాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గంజాయి,మాదక ద్రవ్యాలు రవాణా జరుగుతున్నట్టు తెలిస్తే పోలీస్ వాట్సాప్ నంబర్ 93929 18196కు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని కోరారు. సీసీ డైరెక్టర్ నక్కిన త్రినాథ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయిని చాకెట్లు, ద్రవరూపంలో అమ్మకాలు చేస్తున్నారని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డైట్‌చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు పాల్గొన్నారు.

ఘనంగా కలశ నిమజ్జనోత్సవం



కలశను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఏకాహం ముగింపు సందర్భంగా కలశ నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఘనంగా జరిపారు. కార్తీక మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని నిర్వహించిన ఏకాహం సందర్భంగా కలశాన్ని ఏర్పాటు చేసి, భజన కార్యక్రమం నిర్వహించారు. ఏకాహం బుధవారం ముగియడంతో కలశాన్ని ఊరేగించి, శారదానదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కార్తీక అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

దుప్పట్ల పంపిణీ



శారదానది బ్రిడ్జిపై ఓ వ్యక్తికి దుప్పటి అందజేస్తున్న తాతాజీ

అనకాపల్లి: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో రహదారుల పక్కన నివసిస్తున్న అనాథులకు జేడీ ఫౌండేషన్, జానకీరామా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు నుదురు పాటి తాతాజీ బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో చలినుంచి రక్షణపొందేందుకు వీలుగా 20 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ స్వాట్‌ను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి: కార్మికుల ఆందోళనలను అణచివేయడానికి ప్రత్యేక దళాన్ని(స్వాట్) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడం నిరంకుశ చర్యలకు దారి తీయడమేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, ప్రజలకు తమ సమస్యలపై నిరసన తెలియజేసే హక్కు ఉందని, దీనికి భిన్నంగా ఉగ్రవాదుల్ని అణచివేసినట్టు కార్మిక పోరాటాలని అణచిడానికి జిల్లా పోలీస్‌శాఖ ప్రత్యేకదళాన్ని ఏర్పాటు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలు రావడానికి ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో అనేక రాయితీలను ప్రకటించి, ప్రభుత్వ ఆస్తులను పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోందని ఆరోపించారు. కార్మికుల చట్టాలు అమలు చేయకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తోందని, ప్రశ్నించే కార్మిక వర్గాన్ని గొంతు నొక్కడానికి ప్రత్యేక పోలీస్ దళం ఏర్పాటు చేయడం అన్యాయని చెప్పారు. చేతనైతే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటు చేసి, పరిష్కరించాలని ఆయన హితవుపలికారు. కార్మికుల గొంతు నొక్కాలని చూసిన ప్రభుత్వాలు ఎక్కడా నిలబడలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం వద్ద సీపీఎం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కశింకోట: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తాళ్లపాలెం గ్రామ సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, అత్యాచారాలు అరికట్టాలని, మద్యం దుకాణాలను మూసివేయాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలు ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



తాళ్లపాలెంలో చెరకు పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి స్వప్న, రైతులు

కశింకోట: చెరకు సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న సూచించారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చెరకు పంటను పరిశీలించారు. చీడపీడలు నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. మినుం, పెసలు, నువ్వుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పశు గణన, కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి, జీడిమామిడి, మామిడికి పంటల బీమా చేయాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డయానా, వి.ఎ. ఎ.సన్యాసినాయుడు, జేవీవో కరుణశ్రీ, రైతులు పాల్గొన్నారు.

47 మద్యం సీసాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి, మోసయ్యపేట గ్రామాల్లో దాడి చేసి 47 క్వార్టర్ మద్యం సీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ పి.మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశామన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు నరసింగబిల్లి శివారులో దాడి చేసి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, చింతలపాలెం గ్రామానికి చెందిన చిత్తూరు చిన్న అప్పారావు పట్టుకున్నట్టు చెప్పారు. మరో కేసులో మోసయ్యపేట గ్రామానికి చెందిన దుద్దేటి చిన్నరమణ పట్టుకుని 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ VUDA 3 BHK Duplex Houses for Sale. 2400 Sft with Car Parking at Sujathanagar, Teachers layout. Contact: 98482 15235, 0891-2558326. [V- 823848]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

■ Wanted Female Teachers for LKG UKG & 1st to 3rd std. and English, Hindi, Telugu Subject Teachers for 4th to 7th Std. English fluency is must. Salary: 10,000/- + Ph: 95811 26947. Old Post Office. [V-823884]

■ రియల్ ఎస్టేట్ Co.HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. కావలెను. జీ/కమీషన్ + 2వీలర్ + రూం+భో ఫ్రీ. నెలక్క రూ॥. ఫ్రెష్/Exp. ఫోన్: 7416396781 [HA-16464]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000627]

■ మర్చంట్ నేవీలో Cruise Shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్ వ: 18-27, Qly: 10th & అబోవ్, లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd, T.G., కోయంబత్తూర్ (TN) Ph: 7675982065 [SCA24000632]

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాలల దినోత్సవ శుభాకాంక్షలు - Advt Feature

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
విద్యార్థిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు అధ్యాపక బృందానికి, సిబ్బందికి, కశింకోట ప్రజలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు
శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్
అగ్రహారం వీధి, కశింకోట
Pre LKG to 10th Class
Cell: 9246822430, 9246622430

ఈ బాలల దినోత్సవం.. పిల్లలందరికీ... ఎంతో ఆనందాన్ని, సంతోష వెలుగులు విరజిమ్మాలని కోరుకుంటూ...
బాలల దినోత్సవ శుభాకాంక్షలు
ST. JOHN'S SCHOOL
Affiliated to CBSE New Delhi
Kasimkota, Anakapalli
Ph: 70329 00703, 93944 38685

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు
బాలల దినోత్సవ శుభాకాంక్షలు
డా॥ హిమశేఖర్ విద్యా సంస్థలు
అనకాపల్లి

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
బాలల దినోత్సవ శుభాకాంక్షలు
GOOD SHEPHERD
ENGLISH MEDIUM SCHOOL
Affiliated to the I.C.S.E. Council, New Delhi
ANAKAPALLI - 531 002. Ph: 08924-230777

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు
SRI GAYATRI PRIMARY & HIGH SCHOOL (E.M)
NURSERY to 10th Class
Recognised By AP. Govt.
Narsipatnam Road, Thallapalem. Ph: 92905 69895, 83745 26367

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com